# గడన

వచ్చిన వాడు శంకరం!

నీరెండకు చేతి నడ్డంగా పెట్టుకుని, చెరువుకట్ట పై నుంచీ నడిచి వస్తున్న మనిషిని పోల్చుకోడానికి చాలామంది ప్రయత్నించారు. కానీ పోల్చుకోడంలో ఏ ఒక్కరూకూడా కృతకృత్యులు కాలేకపోయారు. అతడు పట్టణంలో చదువుకుంటున్న మునసబు గారి పెద్దబ్బాయి కాదు. రైల్వేలో పెద్ద ఉద్యోగం చేస్తున్న కరణం గారి మేనల్లుడూకాదు. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, విలేజ్ లెవల్ వర్కర్లలాంటి గవర్నమెంటు ఉద్యోగికాదు. వీరు శంకరం! అందుకే ఇంత ఆశ్చర్యం!

క్రింద పడిన గులకరాళ్లను నుగ్గు నూచం చేస్తున్న లావుపాటి పాదరక్షలు, మడత చెరగని ఇస్త్రీ దుస్తులు, నల్లద్దాల కళ్లజోడు, దువ్వకపోయినా దువ్వినట్టే వుండడానికి అలవాటుపడిన క్రాపింగు– ఈ వేషంతో, పెట్టే పరుపూ మోస్తూ కుర్రవాడొకడు తనను వెంబడించగా ఒకానొకనాటి సుప్రభాతాన శంకరం ఇలా ప్రత్యక్షం కాగలడని ఎవ రనుకున్నారు?

తనకు పదహారో ఏడు జరుగుతుండగా శంకరం వూళ్లోనుంచీ వెళ్లిపోయాడు. వెళ్లిపోయాడనడం కన్నా పారిపోయాడనడం సమంజసం. పారిపోయాక ఏం చేస్తాడు? శంకరానికి చిన్నప్పుడే తల్లి చనిపోయింది. కూలీ నాలీచేసుకుంటూ కొడుకును వీధి బడిలో చదివిస్తున్న తండ్రికూడా మలేరియా జ్వరంతో ఆఖరుశ్వాస వదిలిపెట్టేశాడు. ఎనిమిదేళ్ల వచ్చీ రాక మనుపే నా అన్నవాళ్లు లేని నిర్భాగ్యుడైపోయిన శంకరం విశాల ప్రపంచంలో ఒంటరిగా మిగిలిపోయాడు. చదువుపోతే పోయింది, బ్రతుకు? పిలిచిన వాళ్లకు పలికి, చెప్పడమే తడవుగా చేతిపనీ, కాలిపనీ చేసిపెట్టి పూటకు పట్టెడన్నం సంపాదించుకోవడమే శంకరానికి దిన కృత్యమై పోయింది. అతడు ఒళ్లు దాచుకున్నాడా? లేదు. ఇది తలకు మించిన పనిగదా అని వెనుదీశాడా? లేదు. తెల్లవారక ముందే

చెరుకాకు కొట్టి, రోడ్డు రోలరంత మోపుగట్టి త్రోవపొడుగునా అయిదు మజలీలు చేసి, ఆరో మజిలీకి బరువును ఇంటికి చేర్చాడు. కలిగిన మహారాజులందరూ కానుగచెట్టు క్రింద సేద దీర్చుకొంటుండగా, తను కొండల్లో కోనల్లో తిరిగి వాళ్ల మేకలకూ, గొర్రెలకూ కావలి కాశాడు. పార చేత బట్టుకుని వంకలో వంగి సూర్యుడు నడిమింటికి వచ్చేదాక నడుము పైకెత్తకుండా ఇసుకలో కాలవ దీశాడు. ఎంత చేస్తే నేం! అతడి పనికి గుర్తింపు లభ్యమైందా? లేదు. అతని శ్రమకు యథోచితమైన ప్రతిఫలం ముట్టిందా? లేదు.

ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు! శంకరం వూళ్లో నుంచి పారిపోవడానికి గ్రామస్థులే కారకులని ఎందుకనుకోవాలి? అతనిలో బొత్తిగా లోపించిన మాట కారితనం, సాకులు చెప్పడానికి తెలియని అమాయకత్వం- ఇవే అందుకు కారణాలని ఎందుకనుకోగూడదు!

పారిపోయేనాటికి శంకరం రంగయ్య గారింట్లోపాలేరు. అప్పటి కింకా అతడు సేద్యానికి నిలిచి ఆరు మాసాలు పూర్తి కాలేదు. రంగయ్య శంకరానికి దూరపు బంధువు. మగ సంతు లేకపోవడం చేత రంగయ్య భార్య రత్నమ్మ చనువిచ్చి, మనసిచ్చి 'అల్లుడా, అల్లుడా' అని పిలిచి శంకరాని కా ఇంట్లో ఒక స్థానం ఏర్పరచింది. రంగయ్య వాక్పారుష్యానికి, చేతి విసురుకూ ఆరు నెలలపాటైనా శంకరం తట్టుకోగలిగాడంటే అందుకిదే కారణం! ఓ రోజు రాత్రి శంకరం వీధి నాటకానికి వెళ్లి, మరునాటి ఉదయం కపిల కట్టడం కాస్తా ఆలస్యం కావడంతో రంగయ్య కోపం కట్టలు త్రెంచుకుంది. మేకలకోసం తెగ నరికిన వేప కొమ్మల్ని వాదె వాదెగా చేత బట్టుకుని, ఒకటి విరిగిపోగానే మరొకటి తీసుకుంటూ రంగయ్య శంకరంపైకి విజృంభించాడు. శంకరం ఓర్చుకోగలిగినంత వరకూ ఓర్చుకున్నాడు. ఒళ్లు ఒళ్లంతా వాతలతో చిట్లి పోయింది. అతడు ఇటు చూచాడు. అడుసు మడి, శంకరం ఎగిరి మడిలో దూకాడు. బురద నిలువెత్తున పైకెగురుతూండగా తిరిగి చూడకుండా దౌడుతీశాడు. పోవడం పోవడం అదే పోవడం! మళ్లీ ఈనాటికి తిరిగి వచ్చాడు శంకరం!

శంకరం నిష్క్రమణను గురించి గ్రామంలో అంతగా పట్టించుకున్న వాళ్లెవరూ లేరు. అతని రాకకు ఎదురు చూచిన వాళ్లూ లేరు. గడిచిన ఎనిమిదేళ్ళలో అతడెక్కడ నివసించాడో, ఏంచేశాడో, ఎలా బ్రతుకగలిగాడో ఎవ్వరికీ తెలియదు. లేదంటే అప్పుడప్పుడు శంకరాన్ని గురించి కొన్ని పుకార్లు మాత్రం గ్రామంలో ప్రచారమయ్యేవి. 'వాడు మిల్టరీలో చేరిపోయాడట! బెంగుళూరు కంటోన్మెంటులో పాపయ్యగారికి కనిపించాడట ఆయన ఎలుగెత్తి పిలువబోతుండగా, వాడు జనంలో కలిసిపోయి మళ్లీ ఎంత వెదికినా కనిపించాడుకాదట' అని ఒకరు. అబ్బే అది వట్టి గాలి కబురు. పోయినసారి

మామిడిపండ్ల సీజనులో బొంబాయి వెళ్లొచ్చిన సాయిబులు చెప్పలేదేమిటి? వాడదేదో హోటల్లో కప్పులు కడుగుతున్నాడట! అని మరొకరు. 'వాడి ముఖం, వాడేమిటి, బొంబాయికి వెళ్లడమేమిటి' మొన్న శ్రీరామ నవమికి భద్రాచలం వెళ్లొచ్చిన పంతులుగారు చెప్పారుగా! వాడు రాజమహేంద్రవరం దగ్గర ఎక్కడో ఒక స్టేషన్లో అరటి పండ్లమ్ముకుంటున్నాడట' అని ఇంకొకరు.... ఉబుసుపోకకు జరిగే లోకాభిరామాయణాల్లో శంకరాన్ని గురించిన ప్రసక్తి వాన జల్లులో నీటి బుడగలా ఇంతలో పైకి లేచి, అంతలో అణగారిపోయేది. ఒక్కొక్కప్పుడు ఈ వూహాగానాలు అంతటితో వూరుకునేవి గావు. అమంగళం శాంతించుగాక, అవి శంకరం ప్రాణానికి ముప్పును గూడా శంకించాయి!

కానీ ఇంత కాలానికి, సన్నగా తోటకూర కాడలా రెకరెకలాడుతూ వుండిన శంకరం మెలిదేరిన కండరాలతో ఉక్కు మనిషిలా తయారై, నలద్దాలలో నుంచీ తన చిన్ననాటి విహార స్థలాన్ని ఆసక్తితో పరిశీలించుకుంటూ, కోర మీసాల్ని సవరించుకుంటూ స్వగ్రామంలో అడుగు పెట్టేశాడు.

అప్పటికే రచ్చపైన సోమరిపోతుల పులి జూదం ప్రారంభమైంది. ఆ ఆటలో తనకు సాటి లేదనిపించుకున్న మల్లయ్య గబగబా క్రిందికి దిగి శంకరానికి ఎదురుకోలు వచ్చి చేతులు జోడించబోతూ "కరణంగారిని కేకేసుక రమ్మంటారటండీ?" అన్నాడు.

"కరణంగారిని కేకేయడమే! అదేమిటోయ్ మల్లయ్య మామా! నే నేమైనా తాశీల్దారు ననుకుంటున్నా వేమిటి? అయ్యో, పిచ్చి మాలోకమా! నేను శంకరాన్నయ్యా శంకరాన్ని!"

"ఏమిటీ!" మల్లయ్య తెరచిన నోరు తెరచినట్టే వుండిపోయింది.

ఆశ్చర్యంతో బిర్ర బిగుసుకపోతున్న వాళ్ల నందరినీ వీధిలో విగ్రహాల్లా నిలిపివేసి శంకరం మాత్రం "ఏమిటమ్మో కనకమ్మత్తా! నేనే నమ్మో శంకరాన్ని! అద్దాలు తీసేస్తున్నాను, కావలిస్తే పరాకాయించి చూడు.... నమస్కారాలు తాతయ్యా! ఈ మానవుడంత గుర్తు తెలియకుండా మారిపోయాడేమిటి?.... ఒరేయ్ సుబ్బులూ! నువ్వు గూడా నన్ను మరిచిపోయావట్రా? చెట్టెక్కి టెంకాయలు దొర్లించలేదని నువ్వు చెంపమీద ప్రసాదించిన లెంపకాయ మాత్రం నా కింకా అలానే జ్ఞాపక ముంది" అని కనిపించిన వాళ్లనందరినీ పేరు పేరున పలకరిస్తూ ముందుకు కదిలిపోసాగాడు.

ఆశ్చర్యం నుంచి కోలుకోగానే వూరు వూరంతా శంకరం చుట్టూ ప్రోగయింది. శంకరం శిథిలావస్థలో వున్న తన పూరిపాక చుట్టూ రెండు మూడు సార్లు ప్రదక్షిణం తిరిగి, మళ్లీ వీధిలో నిల్చున్నాడు.

"ఇదేమిటి శంకరం! ఈ ఇంటిని తీరిగ్గా మరమ్మత్తు చేసుకోగూడదూ? వూళ్లో ఇన్ని ఇళ్లుండగా నువ్వీపాడు కొంపలో మకాం పెట్టడ మేమిటి?" అని పదిమంది పది విధాలుగా శంకరాన్ని మందలించారు.

శంకరం చిరునవ్వు నవ్వాడు. "ఈ ఇల్లు పాడుబడిపోతున్న మాట నిజమే! దీనికంటే మీ ఇళ్లు ఎంతో నివాస యోగ్యంగా వున్నమాట గూడా యథార్థమే! కానీ దేశంలో ఇంతకంటే మంచి వూళ్లూ, ఇంతకంటే మంచి ఇళ్లూ ఎన్నో వున్నాయి. కానీ ఎన్ని వూళ్లయినా, ఎన్ని ఇళ్లయినా స్వంత వూరితో, స్వంత ఇంటితో దీటుగావు. ఇప్పటికైనా నే నిలా ఈ వూరి నెందుకు వెతుక్కుంటూ వచ్చాననుకుంటున్నారు? నా కంటూ ఇప్పుడొక వూరిపాక వుండబట్టి! ఇలా గంటున్నందుకు కోపగించుకోకండి" అని శంకరం "సుబ్బులూ!" అని స్నేహితుణ్ణి కేకవేశాడు. "నాకు తక్షణం పదిమోపుల బోద కావాలి. సంధ్యా ఎండా వానా లోపల పడకుండా వూరి ఎగిరిపోయిన చోట, కప్పుకోగలిగితే చాలు."

సుబ్బులు బోద మోపులకోసం పరుగు తీయగానే శంకరం ఆడవాళ్ల వైపు తిరిగాడు. 'ఇదిగో కనకమ్మత్తా! నువ్విప్పుడు అల్లుణ్ణి కాస్తా ఆదుకోకతీరదు. నేను తలుపు తెరవబోతున్నాను. లోపల ఎన్నెన్ని జంతువులు నివసిస్తున్నాయో మనకు తెలియదు. నువ్వు తట్టా, చీపురూ చేత బట్టుకుని నా వెనువెంటనే లోపలికి వచ్చేయాలి."

ఆడా, మగా, ముసలీ ముతకా అందరూ విస్తుపోయారు. వీడేనా శంకరం? నోట్లో నాలుక లేని వాడు, ఎవ్వరేమన్నా ఎదురాడని వాడు, ఒకరింట్లో సేద్యానికుండి దెబ్బలు తినలేక పారిపోయిన వాడు అయిన శంకరం ఇతడేనా?

జాము ప్రొద్దెక్కేసరికి బోద కట్టలు పై కెగురసాగాయి. ఇద్దరు మనుషులు ఈ వైపొకరు, ఆ వైపొకరుగా రిపేరు ప్రారంభించేశారు. ఒకరు ఇంట్లో పేరుకపోయిన ధూళి దూసరాల్ని తట్టకు తోసి దూరంగా పారబోయగానే చిక్కగా పేడ నీళ్లు చల్లేశారు. జిల్లేళ్లను, ఉమ్మెత్తలను తెగనరికి ఇంటి ముందర గూడా చదును చేసేసరికి ప్రొద్దు పడమటికి తిరిగింది.

అప్పటికే భోజనాల వేళ మీరిపోయింది. చింతగింజ వేస్తే మునగని మజ్జిగ, పచ్చిమిరపకాయలు నలిగిన చెరకు పాలు, మామిడిపళ్ల లాంటి ఉపాహారాలతో శంకరానికి బొత్తిగా ఆకలిగావడం లేదు. అతడు ప్రక్క ఇంటి పెరట్లోకి వెళ్లి "అక్కయ్యా! స్నానం చేయబోతున్నాను. పెద్ద చెంబునిలా తీసుకురా" అని ఇంటి లోపలికి కేకవేశాడు.

"ఉండు బాబూ వుండు! కాసేపట్లో వేడి నీళ్లు పెట్టేస్తాను" అంటూ బ్రతిమాలింది ఆ ఇంటి ఇల్లాలు.

"ఎందుకూ! ఈ కట్టెకు ఏడెనిమిదేళ్ళుగా చన్నీటి స్నానమే వాడుకైపోయిం దక్కయ్యా! ఇప్పుడున్నట్టుండి వేడినీళ్ళు తగిలితే ఆరోగ్యం బెడిసినా బెడిసిపోవచ్చు" అంటూ దుస్తులు వూడదీశాడు శంకరం.

రెండు బానల చన్నీటితో శంకరం స్నానం ముగించే సరికి జలదారి మురికి నీరంతా సబ్బు నురగతో క్షీరోదకంలా మారిపోయింది.

పొరుగింటి అరుగుపై నుంచిన పెట్టెనూ, పరుపునూ, తన పాకలోపలికి చేరవేసి శంకరం దుస్తులు మార్చుకుని ఈవలికి వచ్చేసరికి దేశ యాత్రా విశేషాలను వినాలన్న కుతూహలంతో అతని కోసం మంచం వేసి గ్రామస్థులందరూ ఆ మంచం చుట్టూ కూర్చున్నారు.

శంకరం బ్లూమౌంటెన్ ఎక్స్‌ప్రెస్ ఎంత వేగంగా పరుగిడుతుందో విశదీకరించాడు. పెద్ద పెద్ద నగరాల్లోని రాజవీధుల్లో రాకపోకల రద్దీ ఎలాగుంటుందో వర్ణించాడు. ఉత్తరదేశంలో హోలీ పండుగ ఎంత వైభవంగా జరుగుతుందో వివరించాడు.

సూర్యాస్తమానం దాకా ఏకధాటిగా ఉపన్యాసం కొనసాగించిన తర్వాత అతడు లోపలకు వెళ్లి పెట్టె తెరచి, 'ఇదిగో తాతయ్యా! నీకు పొడి, డబ్బీ! కనకమ్మత్తా, నీకు రవిక గుడ్డ! సుబ్బులూ, నీకు టార్చి లైటు! మల్లయ్య మామా, నీకు బీడీ కట్ట" అంటూ ఎవరికి తగినట్టుగా వారికి కానుకలు సమర్పించాడు. చల్లగా వెన్నెల వచ్చింది.

"నాయనా శంకరం!" పిలుపు విని శంకరం వెనుదిరిగి చూచాడు. ఆమె రంగయ్య భార్య రత్నమ్మ.

"అదే మత్తయ్యా! అలా దూరంగా నిలబడిపోయావు. రా, ఇలా వచ్చి మంచం పైన కూర్చో" అన్నాడు శంకరం.

"నీకు వూరిలో అందరూ అయినవాళ్లే శంకరం! మే మొక్కరమేనా కానివాళ్లం" అంది రత్నమ్మ.

"అయ్యయ్యో, అదేం మాటత్తయ్యా! మీరు నా కెందుకు కానివాళ్లవుతారు? ఎవరన్నా రా మాట?"

"ఐతే తెల్లవారెప్పుడో వూళ్లోకి వచ్చిన వాడివి, మా ఇంటి కెందుకు రాలేకపోయావు మరి, పోనీలే బాబూ, భోజనం చేసి వద్దువు గానీలే!"

"నువ్వు పిలవాలే గాని నేను మీ ఇంటికి వచ్చి భోజనం చేయడం "బ్రహ్మాండమా అత్తయ్యా! వస్తా నుండు" అని శంకరం తలుపు మూసి, తాళం వేసి రత్నమ్మను వెంబడించాడు.

"నువ్వు వెళ్లినా వెళ్లిపోయావు గానీ అగుడు నా తలపైనా పడిదింరా శంకరం! అయిదారు నెలల వరకూ తల పై కెత్తుక తిరగలేక పోయానంటే నమ్ము" అన్నాడు రంగయ్య.

"కై కేయి వరాలు కోరకపోతే రాముడు అరణ్యాలకు వెళ్లేవాడా, రాక్షసుల్ని చీల్చి చెండాడేవాడా, అసలు రామాయణమంటూ ఒక కథ పుట్టివుండేదేనా మామయ్యా! నువ్వా రోజున నన్ను కొట్టకపోతే నేనీ వూళ్లోనే వుండి మ్రగ్గిపోయేవాణ్నేమో!"

అది ఎత్తిపొడుపో, ప్రశంసో, రంగయ్య కర్థం కాలేదు.

"కాళ్లు కడుక్కో శంకరం! విస్తర్లు వేసేశాను" అంది రత్నమ్మ.

శంకరం నడవ దాటుకుని లోపల అడుగు పెట్టబోతున్నాడు– తలుపు వెనుక ఓ మెరుపు మెరిసింది.

"నువ్వా కామాక్షి! కళ్లు మూస్తూ తెరస్తూ వ్రేలెడంత వుండేదానివి. నువ్వు ఇంతదానివై పోయావన్న మాట! ఉండు, ముఖం కాస్త చూడనివ్వు మరి! అబ్బబ్బ, లోకంలో వున్న సిగ్గంతా నీ కూతురు దగ్గరే వుందత్తయ్యా!"

సిగ్గుతో ఒదుగుల్లుపోతూ కామాక్షి తుర్రున గదిలోపలికి పారిపోయింది.

"ఐతే ఇంత కాలం ఎక్కడుండినట్టు? ఏం చేసినట్టు?" భోజనంతోబాటు సంభాషణకు గూడా ఉపక్రమించాడు రంగయ్య.

"ఒక వూరా, ఒక పట్నమా మామయ్యా! పూనా, బాంబే, ఢిల్లీ, కలకత్తా" అంటూ ఓ పట్టణాల జాబితా ఇచ్చాడు శంకరం. "ఇక ఉద్యోగం సంగతంటావా మామయ్యా. ఒక బస్సు కంపెనీలో క్లీనర్‌గా చేరి కండక్టరునయ్యాను. క్రమేపీ డ్రయివింగు గూడా నేర్చుకుని ఒక మార్వాడి దగ్గర డ్రయివరుగా పని చేశాను. అంతకు మునుపే కొంత కాలంపాటు రిక్షా లాగాను. ఆ తరువాత ఓ టూరింగ్ సినిమాలో టికెట్లు అమ్మాను."

"ఇంత చేసీ ఏ మాత్రం మిగిల్చావురా శంకరం?" అన్నాడు రంగయ్య.

"నేను మిగిల్చిన దాన్ని గురించి నీతో గొప్పగా ఏమని చెప్పుకోగలను మామయ్యా? నాకు తెలిసి బొంబేలో ఓ బిచ్చగాడున్నాడు. వాడు నాలుగేళ్లలో వెయ్యి రూపాయలు మిగిలించాడు."

భోజనాలు పూర్తి కాబోతున్నాయి. "సేద్యం, బాగా జరుగుతోందా మామయ్యా?" అన్నాడు శంకరం.

"ఏం సేద్యమో లేరా! ఒంటిగాణ్ణి. ఇంత పనీ అంత పనీ నేను పొలం దగ్గర వుండకపోతే జరగడం లేదు. అందుకు తోడూ రోజులు కూడా మారి పోతున్నాయి. కొంతకు కొంత భూమిని వదలించుకోవాలనుకుంటున్నాను. మనం అమ్మజూపేసరికి

బేరాలు అంతంతమాత్రంగానే కుదిరేటట్టున్నాయి. నాలుగు వేలకు అడుగుతున్నారు. నేను అయిదు వేలు చెబుతున్నాను. నీకు తెలిసిందేగదా కొత్త బావి క్రింద నాలుగెకరాల పొలం.

"ఏలాగూ అమ్మ దలుచుకున్నావుగా మామయ్యా! ఆ నాలుగు వేలూ నేనే ఇచ్చుకుంటాను. పైగా నీ మేలు మరచిపోను' అన్నాడు శంకరం.

"నువ్వా! పొలం కొనేస్తావా!" తెల్లబోతూ అడిగాడు రంగయ్యా.

"అదేం మామయ్యా! నేను పొలం కొనగూడదేమిటి?" అమాయకంగా ప్రశ్నించాడు శంకరం.

◆ ◆ ◆

రంగయ్యగారి పొలాన్ని శంకరం కొన్నబోతున్నాడన్న వార్త ఆ మరునాటి ఉదయానికల్లా గ్రామమంతటా ప్రాకిపోయింది. "నాలుగు వేలిచ్చి పొలం కొనబోతున్న ఆసామి తనకు చేతి కావలిగా మరొక నాలుగు వేలు దాచుకొని వుండక పోడు. అంతా పది వేలదాకా సంపాదించినట్టున్నాడు" ఇలా వూహాగానాలు విశృంఖలంగా సాగిపోయాయి.

"పొలం కొనబోతున్నాటవగా శంకరం! మంచిది. చాలా మంచిది. ఆ నాలుగు నూకలు గూడా తలమీద వేసుకొని ఒక ఇంటివాడి వయ్యావంటే అంతకంటె మేము కోరగలిగిందేమీ లేదు" అన్నాడు మల్లయ్య.

"మీ రందరూ దయ పెట్టాలే గాని, నా పెళ్లికేం మల్లయ్య మామా! చిటికెలో జరిగిపోదూ!" ముసిముసి నవ్వులు ఒలకబోశాడు శంకరం.

స్వగ్రామంలోనేగాక, ఆ ప్రాంతాని కంతటికీ పెళ్లిళ్ల పేరయ్యగా వ్యవహరిస్తున్న మనిషి మల్లయ్య. అతడు వున్న చోటనే వుండి తీగను కదలించాడు. దానితో డొంకంతా కదిలింది. ఎర్రచెరువు వెంకటాద్రి తనే ఖర్చులన్నీ భరించి జరిపిస్తానన్నాడు. మామిడి తోపులమీద సంవత్సరాని కొకటి రెండు వేలు కళ్లజూస్తున్న వెన్నెల బయలు వీరస్వామి తన తోపులో నేరేడు చెట్లు నరికి దూలాలు కోయించి ముచ్చటగా ఓ చిన్న భవంతి కట్టిస్తా నన్నాడు. మల్లయ్య ఒక రోజు ఎర్ర చెరువుకూ, మరొక రోజు వెన్నెల బయలుకూ వెళ్లి పెళ్లి సంబంధాలు చూచి వచ్చాడు.

"మన కళ్ల ఎదుట పుట్టి పెరిగిన కుర్రాడు గదండీ! మనం ఎలా చెబితే అలా వినేవాడు. పని గట్టుకుని వెదికితే మాత్రం మన కింతకంటే మంచి సంబంధం ఎక్కడ దొరకతుంది." అంటూ భర్త చెవిలో ఇల్లు గట్టుకుని పోరసాగింది రత్నమ్మ.

రంగయ్యకు చెడ్డ చిరాకు కలిగింది. అతడు మల్లయ్యను పిలవనంపి అతనికి ఎదమొఖం, పెడమొఖంగా కూర్చుని "నీ కళ్లకు ఎర్ర చెరువు వెంకటాద్రి కనిపించాడు. వెన్నెల బయలు వీరాసామి కనిపించాడు. కానీ వూళ్లో వున్న మేము మాత్రం కనిపించలేదు. అంతేగాదూ?" అంటూ రుసరుసలాడాడు.

"ఎంతమాటెంత మాట! ఇప్పుడేం జరిగిపోయింది రంగయ్యా! నీ ఉద్దేశ్య మేమిటో అదీ చెప్పు" అన్నాడు మల్లయ్య.

"వెంకటాద్రి కంటె, వీరాసామికంటే ఇక్కడెవరూ రోజులు తక్కువగా పుట్టలేదు. ఆ నాలుగెకరాల నేల కుర్రాడి పేరిట వ్రాసేస్తాను. సరేనా!" అన్నాడు రంగయ్య.

"చెప్పి చూస్తాను రంగయ్యా! శంకరం గూడా సిరి తనంతట తాను వస్తే మోకాలొడ్డేవాడు గాడు. ఐనా అతనితో మాట్లాడకుండా మనం ఏ నిర్ణయానికీ రాలేము గదా!" అన్నాడు మల్లయ్య.

మల్లయ్య ఈ సంబంధాన్ని గురించి శంకరానికి నచ్చజెప్పవలసిన అవసరం లేకపోయింది.

"ఈ విషయంలో చివరి మాట నీదే మల్లయ్యమామా! నన్ను పాల ముంచినా, నీట ముంచినా నీదే భారం" అన్నాడు శంకరం.

◆ ◆ ◆

రంగయ్య ఇంటి ముందర పందిరిలో బాజాలు, భజంత్రీలు మ్రోగాయి. కామాక్షి కుటుంబానికి కడగొట్టు పిల్ల గావడంచేత రంగయ్య మూడురోజులపాటు అట్టహాసం పట్టపగలుగా పెళ్లి జరిపించాడు.

పెళ్లి పందిరి చుట్టూ తిరిగినప్పుడు, వూయలూగినప్పుడు, పూల పల్లకిలో వూరేగినప్పుడు వధూవరుల ఈడూ జోడూ చూచి బంధువులందరూ మురిసిపోయారు. కూతురూ, అల్లుడూ చేతులు గలిపి పాద పూజ చేసినప్పుడూ, అల్లుడి సరసన నిల్చిన కూతురికి నుదుట కుంకమ పెడుతున్నప్పుడూ రత్నమ్మ ఆనంద వివశత్వంతో మేను మరచిపోయింది.

అందరిలోనూ మనసు మనుసులో లేనిది ఒక్క రంగయ్యకు మాత్రమే! పెళ్లికి వెయ్యి రూపాయల దాకా త్రుప్పు వదిలింది. నాలుగెకరాల మాగాణి అల్లుని పేర వ్రాయడంతో నికరంగా అయిదు వేల రూపాయలు కళ్లబడే అవకాశం చేయి దాటి పోయింది. రోజులేమో గడిచిపోతున్నాయి. అల్లుని ఆంతర్యం మాత్రం బయటపడడం లేదు.

రంగయ్య భార్యను పిలిచాడు. "నువ్వు అల్లుణ్ణి చూచి సంబరపడిపోతున్నావు. సరే! కానీ అతడేమాత్రం వెనకేశాడో మన కింకా తెలియదు. మనమూ నిలదీసి అడగలేము. అతడూ తన౦తట తానే బయటపడడు. ఎంతకాలమని ఈ నసుగుసులు?"

"ఇంతకూ నన్నిప్పుడేం చేయమంటా రండీ?" అంది రత్నమ్మ.

"మన మిప్పుడేమీ చేయలేము. ఎంత తెచ్చాడో ఏమిటో అమ్మాయి నడిగి తెలుసుకోమను."

తల్లి ప్రోద్బలం క్షణ క్షణానికీ ఎక్కువైపోవడంతో ఉక్కిరి బిక్కిరై పోయింది. ఆఖరు సమయమూ, సందర్భమూ అనువుగా చూచుకుని "ఈ ముసుగులో గుద్దులాటేమిటి బావా! ఇక్కడెవరూ నీ సంపాదన కాజేయడానికి కాచుకు కూచోలేదు. అసలు విషయం తెలుసుకోవాలన్న ఆత్ర మొక్కటి తప్పితే, మావాళ్లకు నీ డబ్బెందుకూ?" అంది కామక్షి.

శంకరం లోకపు తీరు చూచి తనలో తానే నవ్వుకున్నాడు. తను విద్యాధికుడుగాడు. మేధావిగాడు. విదిలించి భుజాన వేసుకోడానికి పై గుడ్డగూడా లేని పరిస్థితిలో, తను కట్టుకున్న నాలుగు మూళ్ల పంచతో దేశంపైకీ వెళ్లిపోయాడు. తను వూళ్లు తిరిగిన మాట నిజమే. ఉద్యోగాలు చేసిన మాట నిజమే. కానీ తన సంపాదన పొట్ట పూడ్చుకోడానికి అందదుకులుగా సరిపోయింది. దొంగతనాలు, దోపిడీలు చేయగలిగితే ఏమోగానీ, లేకపోతే తనలాటి వాడు వేలకొలదిగా డబ్బు గడించే సదుపాయ లేవీ ప్రపంచంలో లేవు. తన వేషాన్ని చూచి, మాటల్ని చూచి వీళ్లు తనేదో మోయరానంత ముల్లెతో స్వగ్రామానికి తిరిగి వచ్చినట్టు భావిస్తున్నారు. వీలైనంతవరకూ వాళ్లా విధంగా భావించడం తనకూ, వాళ్లకూ గూడా శ్రేయస్కర మనిపించింది శంకరానికి!

భార్య నుదుటిమీదికి వ్రాలుతున్న ముంగురుల్ని సవరిస్తూ "డబ్బు కేం కామాక్షీ! కావలసినంత వుంది. కానీ ఇక్కడ లేదు. బ్యాంకులో మూలుగుతోంది" అన్నాడు శంకరం.

(ఆంధ్రసచిత్ర వార పత్రిక 13-8-58)